క్లుప్తంగా

రేపు పీవీపై పాట ఆవిష్కరణ

నయీంనగర్: ఈనెల 28న భారతరత్న, మాజీ ప్రధాని పీవీ.నర్సింహారావు జయంతి సందర్భంగా పీవీపై రాసిన పాట సీడీ ఆవిష్కరణ కార్యక్రమం 27న జరగనుందని ఆయుర్వేద వైద్యులు పాములపర్తి రామారావు తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం సాయంత్రం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో జరగనున్న కార్యక్రమాన్ని పీవీ అభిమానులు, సాహితీ ప్రియులు, కవులు, కళాకారులు, సంగీత ప్రియులు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కమిషనర్‌కు శుభాకాంక్షలు



హన్మకొండ: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌ను టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్ సర్కిల్ అధికారులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు ఎన్పీడీసీఎల్ వరంగల్ సర్కిల్ ఎస్ఈ కె.గౌతం రెడ్డి, డీఈలు ఎ.ఆనందం, ఎస్.మల్లికార్జున్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

అన్నదానం



హన్మకొండ అర్బన్: శ్రీభద్రకాళి వీరభద్ర సేవ సమితి ఆధ్వర్యంలో బుధవారం సందర్భంగా నగరంలోని బాలసముద్రంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కాకతీయ విశ్వవిద్యాలయ అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ మండవ నర్సింహారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవాసమితి వ్యవస్థాపకుడు పిన్నా శివకుమార్ ఆధ్వర్యంలో ప్రతీ అమావాస్య రోజు 100 కిలోల బియ్యంతో సుమారు 600 మందికి అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సేవా సమితి నిర్వాహకుడు, కేంద్ర ప్రభుత్వ సమాచార శాఖ ఉమ్మడి వరంగల్ జిల్లా అధికారి ఎస్.శ్రీధర్, రిటైర్డ్ హెచ్‌ఎం నారాయణ రెడ్డి, చొల్లేటి శ్రీధర్, గౌరిశెట్టి ధనుంజయ, ఉల్లెంగుల మహేష్, విష్ణువర్ధన్, రామ్మోహన్, పాములపర్తి కేశవ్ కుమార్, రాంరాజ్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్యకు పరిష్కారం

మడికొండ: మడికొండ జెడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్‌లో నెలకొన్న డ్రెయినేజీ సమస్యకు ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు పరిష్కార మార్గం చూపాలి. పాఠశాలను మంగళవారం ఎమ్మెల్యే సందర్శించగా, సమస్యలను పరిష్కరించాలని మడికొండ జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం సంధ్యారాణి, ఎంపీపీఎస్ హెచ్‌ఎం మల్లారెడ్డి, ఉపాధ్యాయులు కోరారు. వారు పేర్కొన్న డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలన్న ఎమ్మెల్యే ఆదేశాల మేరకు జేసీబీ సహాయంతో బుధవారం కచ్చా కాలువ తీయించారు.

13న స్వర్ణకారుల సంఘం ఎన్నిక

హన్మకొండ చౌరస్తా: జులై 13వ తేదీన హనుమకొండ జిల్లా స్వర్ణకారుల సంఘం ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలంగాణ స్వర్ణకారుల సంఘం ఉపాధ్యక్షుడు శ్రీరామోజు భిక్షపతి తెలిపారు. హనుమకొండలోని జువెల్లరీ స్ట్రీట్‌లో జిల్లా పరిధిలోని స్వర్ణకారుల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా భిక్షపతి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో భాగంగా జులై 6వ తేదీన నామినేషన్ల స్వీకరణ, 7న ఉపసంహరణ, 13న ఎన్నికల నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించినట్లు వెల్లడించారు. ఎన్నికల కన్వీనర్‌గా శ్రీరామోజు జలందర్ వ్యవహరించనున్నట్లు భిక్షపతి తెలిపారు. సమావేశంలో కట్టా ఈశ్వరప్రసాద్, నారోజు హరినాథ్, కట్టా రాజేందర్, మునిగంటి కమలాకర్, పెందోట చక్రపాణి, మండలోజు జగన్, ఉప్పల రాజేష్, అడ్లూరి ప్రవీణ్, పానుగంటి శ్రీధర్ పాల్గొన్నారు.

రూ.1.01 లక్షల గుట్కా ప్యాకెట్ల స్వాధీనం

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీకి చెందిన కేసోజు రోహిత్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని, రూ.1.01 లక్షల విలువ చేసే గుట్కాలను స్వాధీనం చేసుకున్నారు. కాజీపేట పోలీసుల కథనం ప్రకారం కొంతకాలంగా రోహిత్.. గుట్కాలు అమ్ముతున్నట్లుగా అందిన సమాచారం మేరకు ఆకస్మిక దాడులు చేసి రవాణాకు సిద్ధంగా గుట్కాలను పట్టుకున్నారు. నిందితుడిపై కాజీపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ తీగ తెగిపడి రెండు జీవాలు మృతి

మడికొండ: విద్యుత్ సరఫరా ఉన్న తీగ తెగిపడి రెండు మూగ జీవాలు మృతి చెందిన సంఘటన మడికొండ శివారులో జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం కాజీపేట మండలం మడికొండ గ్రామానికి చెందిన తొర్రి రవి యాదవ్ బుధవారం ఉదయం మేత కోసం గొర్రెలను తోలుకొని మడికొండ శివారులోకి వెళ్లాడు. ఈ క్రమంలో మేత మేస్తున్న గొర్రె, మేకపై విద్యుత్ వైరు తెగిపడడంతో అవి మృతిచెందాయి. అధికారులు స్పందించి ఆదుకోవాలని బాధితుడు రవి కోరారు.

శిథిలావస్థలో అంగన్‌వాడీ కేంద్రం

- కడిపికొండలో ఏడాదిగా అద్దె భవనంలో కొనసాగింపు
- పట్టించుకోని అధికారులు

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండ గ్రామం ఎస్సీకాలనీలోని ప్రభుత్వ ప్రైమరీ పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ భవనం పైకప్పు పెచ్చులూడిపోయి శిథిలావస్థకు చేరింది. నిధుల కొరతతో మరమ్మతులకు నోచుకోక ఆ భవనం మూతపడింది.

ఏడాదిగా అద్దె భవనంలో..

అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఆ కేంద్రానికి వచ్చేందుకు చిన్నారులు, బాలింతలు, గర్భిణులు భయాందోళనకు గురయ్యారు. దాంతో ఏడాది క్రితం అద్దె భవనంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తరలించారు. సొంత అంగన్‌వాడీ భవనాలకు రూపకల్పన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. కడిపికొండలోని అంగన్‌వాడీ భవనానికి మాత్రం మరమ్మతులు చేయించడం లేదని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



శిథిలావస్థకు చేరుకున్న అంగన్‌వాడీ భవనం

లబ్ధిదారుల వివరాలు

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సౌజన్యంతో పనిచేస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, ప్రీస్కూల్ విద్యార్థులు సంక్షేమ ఫలాలను పొందుతున్నారు. కడిపికొండలోని అంగన్‌వాడీ కేంద్రంలో 7 నెలల నుంచి మూడేళ్ల లోపు 34 మంది చిన్నారులు, ప్రీస్కూల్ 3 నుంచి 6 ఏళ్ల చిన్నారులు 9 మంది, గర్భిణులు, బాలింతలు 12 మంది ప్రతిరోజు అంగన్‌వాడీ కేంద్రం నుంచి లబ్ధిపొందుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం

కడిపికొండలోని అంగన్‌వాడీ కేంద్రం స్లాబ్ పెచ్చులూడి పోవడంతో మరమ్మతుల నిమిత్తం నిధుల కోసం జిల్లా అధికారికి నివేదిక సమర్పించాం. హనుమకొండ ప్రాజెక్ట్ పరిధిలో 14 సొంత భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ భవనాలకు మరమ్మతుల నిమిత్తం రూ.రెండు లక్షల లోపు 9 సెంటర్లకు నిధులు మంజూరయ్యాయి. కడిపికొండ అంగన్‌వాడీ భవనం మరమ్మతులకు రూ.రెండు లక్షలపైగా నిధులు కావాలి. ఉన్నతాధికారులు నిధులు మంజూరు చేస్తే మరమ్మతులు చేపట్టే అవకాశం ఉంది.

– విశ్వజ, సీడీపీఓ, హనుమకొండ

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్

విద్యారణ్యపురి: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.శ్రీనివాస్‌రావు సూచించారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడకుండా, క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. సామాజికాభివృద్ధిలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం డ్రగ్స్ దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రాజ్‌కుమార్, అధ్యాపకులు శ్రీధర్, జ్యోతిర్మయి, సంధ్యారాణి, సరిత, శోభ, రేవతి, సాంబశివయ్య, ప్రసాద్, వివేక్, రాజేంద్రప్రసాద్, లైబ్రేరియన్ రాజేశ్వర కుమార్ పాల్గొన్నారు.



మడికొండ చౌరస్తాలో ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసులు

మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన

మడికొండ: మాదకద్రవ్యాల నియంత్రణపై మడికొండ పోలీసులు అవగాహన కల్పించారు. మడికొండ ఇన్‌స్పెక్టర్ కిషన్ ఆధ్వర్యంలో ఎంఎన్ఆర్ కాలనీ నుంచి మడికొండ చౌరస్తా వరకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ కిషన్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రతిఒక్కరూ కట్టుబడి ఉండాలన్నారు. మత్తు పదార్థాలు అమ్మినా, కొన్నా చట్టరీత్యానేరం అని హెచ్చరించారు. డ్రగ్స్ రహిత సమాజం నిర్మాణానికి అందరూ కృషి చేయాలని కోరారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మడికొండ ఏఎస్సై చంద్రమౌళి, పోలీసు సిబ్బంది, కోచ్ ఫ్యాక్టరీ కార్మికులు, స్థానికులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే ఉజ్వల భవిష్యత్



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

మామునూరు: ఒక లక్ష్యాన్ని ఎంచుకుని క్రమశిక్షణతో శ్రద్ధగా చదివితే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. మామునూరు టీజీఎస్పీ క్యాంపు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠశాల హెచ్‌ఎం నరసింహారావు అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సోషల్ మీడియా, డ్రగ్స్ వంటి విషయాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కాగా, వరంగల్ రోటరీ క్లబ్ సహకారంతో విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రమేష్, కార్పొరేటర్ ఈదుల అరుణ, ఇనుగాల జోగిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న ఏబీఎస్ఎఫ్ నాయకులు

కేయూ క్యాంపస్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఏబీఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏబీఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ మాట్లాడుతూ విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులను నియంత్రించాలని సూచించారు. కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ నాయకులు నవీన్, తరుణ్, గణేష్, వంశీ, గోవిందు, సమ్మయ్య, సూర్యసాయి పాల్గొన్నారు.

‘చరిత్రలో చీకటి అధ్యాయం ఎమర్జెన్సీ’



మాట్లాడుతున్న అల్జాపూర్ శ్రీనివాస్

హన్మకొండ: స్వాతంత్ర్య భారతదేశ చరిత్రలోనే ఎమర్జెన్సీ ఒక చీకటి అధ్యాయమని బీజేపీ రాష్ట్ర నాయకుడు అల్జాపూర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని వేద బాంక్వెట్ హాల్‌లో ‘ఎమర్జెన్సీ డే-కాంగ్రెస్ విధించిన ఎమర్జెన్సీ-భారత ప్రజాస్వామ్యంలో చీకటి అధ్యాయానికి 50 సంవత్సరాలు’ అంశంపై సదస్సు నిర్వహించారు. బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోశ్‌రెడ్డి ఆధ్యక్షతన జరిగిన ఈసదస్సులో అల్జాపూర్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. నాటి ప్రధాని ఇందిరా గాంధీ రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి అధికార దుర్వినియోగంతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ ఎమర్జెన్సీని ప్రకటించిందని ధ్వజమెత్తారు. జాతీయవాదం, పౌర హక్కుల విలువలపై ఆధారపడిన బీజేపీ ఎమర్జెన్సీ తర్వాత ప్రజల నిజమైన గొంతుగా ఎదిగిందన్నారు. ఈసందర్భంగా ఎమర్జెన్సీ సమయంలో జైలు శిక్ష అనుభవించిన డాక్టర్ సమ్మిరెడ్డి, రామచందర్, కోటేశ్వర్‌రావును బీజేపీ నాయకులు శాలువా కప్పి సన్మానించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, మార్తినేని ధర్మారావు, బీజేపీ హనుమకొండ జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మ, నాయకులు దొంతి దేవేందర్ రెడ్డి, డాక్టర్ పగడాల కాళీప్రసాద్, డాక్టర్ పెసరు విజయ్ చందర్ రెడ్డి, డాక్టర్ సిరంగి సంతోశ్, ఆర్.పి.జయంత్ లాల్, డివిజన్, మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



సమ్మె నోటీస్ అందజేస్తున్న రామ రాజేష్ ఖన్నా

ఎంజీఎం: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ జులై 9న హైదరాబాద్‌లో ఇందిరా పార్కు వద్ద చేపట్టే మహాధర్నాను విజయవంతం చేయాలని వైద్య శాఖ కార్మికులకు ఎస్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా పిలుపునిచ్చారు. ఈ మేరకు సార్వత్రిక సమ్మెకు సంబంధించిన నోటీసును వరంగల్ అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్ డాక్టర్ ఎం.యశస్వినికి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో నర్సింగ్ ఆఫీసర్ ఆర్.భాగ్యలక్ష్మి, ఏఎన్ఎం కోమల తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత

కేయూ క్యాంపస్: దేశవ్యాప్తంగా జులై 9న జరగనున్న సార్వత్రిక సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, యూనివర్సిటీస్ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టు రవి పిలుపునిచ్చారు. ఈ మేరకు సమ్మెకు సహకరించాలని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రంకు బుధవారం సమ్మె నోటీస్ అందజేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కచ్చకాయల చిరంజీవి, సీఐటీయూ కేయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాంచంద్రర్, దేశిని రవికుమార్, నాయకులు శోభన్ కుమార్, రణధీర్, శోభ పాల్గొన్నారు.



రిజిస్ట్రార్‌కు సమ్మె నోటీస్ ఇస్తున్న నాయకులు

దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనాలి

న్యూశాయంపేట: నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వచ్చేనెల 9న జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో అన్నిరంగాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ పిలుపునిచ్చారు. హనుమకొండ సుందరయ్య భవన్‌లో పలు రంగాల కార్మికులతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు బి.చక్రపాణి, మొగిలి, సుదర్శన్, విజేందర్, సదానందం, రాజయ్య పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు నాగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న జి.నాగయ్య

ఖిలా వరంగల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. ఎమర్జెన్సీ విధించి నేటికి 50 ఏళ్లు పూర్తైన సందర్భంగా వరంగల్ ఉర్సు గుట్ట పార్టీ కార్యాలయంలోని రామ సురేందర్ భవనలో పార్టీ నాయకురాలు రత్నమాల అధ్యక్షతన బుధవారం సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ 1975లో ఇందిరాగాంధీ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటిత ఎమర్జెన్సీ విధించిందని గుర్తుచేశారు. ఆనాడు ప్రతిపక్ష పార్టీల నాయకులను ముఖ్యంగా కమ్యూనిస్టుల నేతలు, కార్యకర్తలు, జర్నలిస్టులను జైలుపాలు చేసిందని వాపోయారు. భావ ప్రకటన స్వేచ్ఛ హక్కును హరించి వేసిందని, సభలు సమావేశాలు పెట్టుకునే హక్కు లేకుండా చేసిందని అన్నారు. దాంతో ప్రజలు తిరగబడి తర్వాత జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఘోరంగా ఓడించారని గుర్తుచేశారు. నేడు కేంద్రంలో పేరుకు ఎమర్జెన్సీ అని ప్రకటించకపోయినా పాలన మాత్రం అప్రకటిత ఎమర్జెన్సీని తలపిస్తోందని విమర్శించారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి సీహెచ్.రంగయ్య, నేతలు సింగారపు బాబు, అరూరి కుమార్, వలదాసు దుర్గయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు కెనరా బ్యాంకు చేయూత



బ్యాగులు అందుకున్న విద్యార్థులతో శాంతికుమార్

కాజీపేట రూరల్: వచ్చిన లాభాల్లో 3 శాతం నిధులను సమాజాభివృద్ధికి సేవాదృక్పథంతో కెనరా బ్యాంకు ఖర్చు చేస్తోందని కెనరా బ్యాంక్ హనుమకొండ రీజినల్ ఆఫీస్ ఏజీఎం శాంతికుమార్ అన్నారు. ఈ మేరకు కాజీపేట దర్గా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 60 మంది విద్యార్థులకు సుమారు రూ.20 వేల విలువగల స్కూల్ బ్యాగులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే నిరుపేద విద్యార్థులకు ప్రతి సంవత్సరం ఒక్కో పాఠశాలలో ఆరుగురు విద్యార్థులకు రూ.5 వేల చొప్పున స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్ఎస్ఎం.స్వామి, బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ అసిస్టెంట్ సెక్రటరీ శశిధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ తులసీరామ్, స్టేట్ కమిటీ సభ్యులు రాజేంద్రప్రసాద్, ఎండీ.జలీల్, సభ్యులు రాజేంద్రప్రసాద్, దేవేందర్, ప్రేమ్‌కుమార్, ఇంద్రసేన, ఉర్దూమీడియం పాఠశాల హెచ్‌ఎం ఎండీ.మక్బుల్ హుస్సేన్, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం రత్నకుమారి, హైస్కూల్ స్టాఫ్ సెక్రటరీ కె.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జులై 10న గురుపౌర్ణమి వేడుకలు

రామన్నపేట: నగరంలోని ఎల్లమ్మ బజార్‌లోని సాయి సేవాదళ్ భజన మందిరంలో సాయి సేవాదళ్, సాయి మహిళా పరపతి సంఘం ఆధ్వర్యంలో జులై 10న గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు సాయి సేవాదళ్ అధ్యక్షుడు ఆరుట్ల శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు భజన మందిరంలో గురుపౌర్ణమి వేడుకల కరపత్రాలను భజన సభ్యులు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా బాబాకు హారతులు, అభిషేకాలు, అన్నదానాలు, పురవీధుల్లో పల్లకీ ఉత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు చిట్టిమల్ల విజయ్ కుమార్, రవీంద్ర చారి, వేముల శ్రీనివాస్, జగదీష్, కల్యాణ్, ఆరుట్ల ప్రసూన, స్వరూపరాణి, వేముల కమల, చిన్నాల హారిక, సుప్రజ, చందన, వెన్నెల, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సభ్యులు

దరఖాస్తు చేసుకోని వారికి అవకాశం కల్పించాలి



ఆర్సీఓ రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఎస్ఎఫ్ నాయకులు

హసన్‌పర్తి / విద్యారణ్యపురి: మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల కళాశాల మొదటి సంవత్సరం స్పాట్ ప్రవేశాల్లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోని వారికి కూడా కౌన్సెలింగ్‌లో అవకాశం కల్పించాలని బీఎస్ఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు ఎంజేపీ ఆర్సీఓ రాజ్‌కుమార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజేందర్, కార్యదర్శి బొట్ల నరేష్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా మహాత్మా జ్యోతిబా పూలే కళాశాలలో ప్రవేశాలకు ఆన్‌లైన్ చేసుకోని వందలాది మంది విద్యార్థులు బుధవారం జరిగిన కౌన్సెలింగ్‌కు హాజరయ్యారని చెప్పారు. అయితే, వారిని అధికారులు లోపలికి అనుమతించలేదన్నారు. అనాథలు, సంచార జాతికి చెందిన వారికి అవకాశం కల్పించాలని కోరారు.

సంక్షిప్తంగా

‘స్కూల్’ను ప్రభుత్వ భూమిలోనే నిర్మించాలి

కేయూ క్యాంపస్: యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను కాకతీయ యూనివర్సిటీలో కాకుండా ఇతర చోట ప్రభుత్వ భూమిలోనే నిర్మించాలని బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, ఇన్‌చార్జ్ జెట్టి రాజేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రంకు బుధవారం వినతపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేయూకు చెందిన భూమిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను నిర్మించాలని పాలకమండలిలో నిర్ణయించడం సరికాదన్నారు. బీఆర్ఎస్వీ నాయకుడు డాక్టర్ కొమురయ్య, బాధ్యులు మాచర్ల శరత్‌చంద్ర, అరూరి రంజిత్, లంక రాజగోపాల్, గంద్రకోట రాకేష్‌యాదవ్, కొనకటి ప్రశాంత్, వస్తం అనిల్, స్నేహిత్ పాల్గొన్నారు.

ఏఐఎస్‌బీ వార్షికోత్సవం

రామన్నపేట: ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ (ఏఐఎస్‌బీ) 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ వేణురావు కాలనీలోని ఏకశిల జూనియర్ కళాశాల వద్ద ఏఐఎస్‌బీ రాష్ట్ర కన్వీనర్ హకీమ్‌నవీద్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషలిజం, శాంతి, అభ్యుదయం అనే నినాదాలతో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాల సాధన కోసం గత 74 ఏళ్ల నుంచి విద్యారంగ సమస్యల పరిష్కారానికి దేశ వ్యాప్తంగా అలుపెరుగని పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్య వ్యతిరేక విధానాలపై భవిష్యత్ పోరాటాలను మరింత ఉధృతంగా నిర్వహించడానికి విద్యార్థులు ఏఐఎస్‌బీలో చేరాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బీ జిల్లా కన్వీనర్ రోహిత్, నాయకుడు పెండ్యాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ సీతంపేట కార్యవర్గం ఎన్నిక

హసన్‌పర్తి: ఎమ్మార్పీఎస్ సీతంపేట గ్రామశాఖను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామశాఖ అధ్యక్షుడిగా కన్నయ్య, అధికార ప్రతినిధిగా గిన్నారపు రాకేష్, ఉపాధ్యక్షుడిగా దుప్పటి చిరంజీవి, ప్రధాన కార్యదర్శిగా గిన్నారపు ప్రసాద్, కార్యదర్శిగా బన్నీ, సహాయ కార్యదర్శిగా మేకల రాజేందర్, కోశాధికారిగా రత్నాకర్ ఎన్నికయ్యారు.

ఎంఎస్పీ గ్రామశాఖ కార్యవర్గం

ఎంఎస్పీ గ్రామశాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గిన్నారపు జనార్ధన్, ఉపాధ్యక్షుడిగా జిన్నారపు రమేష్, ప్రధాన కార్యదర్శిగా రవి, కార్యదర్శిగా మేకల హరికృష్ణ, కోశాధికారిగా భిక్షపతి, కార్యవర్గ సభ్యులుగా శంకర్, గిన్నారపు ప్రభాకర్‌ను ఎన్నుకున్నట్లు ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ ఆరెపల్లి పవన్, కోఇన్‌చార్జ్ రాజారపు భిక్షపతి తెలిపారు.

మంత్రి శ్రీహరిని కలిసిన జిల్లా ఫిషరీస్ చైర్మన్

హన్మకొండ అర్బన్: రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి వాకాటి శ్రీహరిని హైదరాబాద్‌లోని సచివాలయంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ ఫిషరీస్ చైర్మన్ ప్రణయ్ దీప్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మత్స్యకారుల సమస్యలు, వారి అభివృద్ధికి కావాల్సిన పథకాల గురించి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫిషరీస్ కాంగ్రెస్ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మండల సమ్మయ్య, కాంగ్రెస్ హనుమకొండ జిల్లా గీత కార్మిక చైర్మన్ బొమ్మ చంద్రమౌళి, యూత్ కాంగ్రెస్ నాయకుడు రాంగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ముస్లిం వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడి మృతి

న్యూశాయంపేట: వరంగల్ నగరానికి చెందిన సంఘ సేవకుడు, ముస్లిం వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మహ్మద్ ఇబ్రహీం (81) అమెరికాలో బుధవారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ అమెరికాలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస వదిలారు. మృతుడికి నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గతంలో ఆయన ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అనేక స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహించి సహాయ సహకారాలు అందించి పలువురి మన్ననలు పొందారు. ఇబ్రహీం మృతిపై పలువురు రాజకీయ నాయకులు, మత పెద్దలు, తదితరులు సంతాపం తెలిపారు.

జంగాను కలిసిన పద్మశాలి సంఘం కార్యవర్గం

మడికొండ: మడికొండ గ్రామానికి చెందిన పద్మశాలి సంఘం నూతన కమిటీ సభ్యులు బుధవారం టేకులగూడెంలో రాష్ట్ర ఆయిల్ అండ్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డిని ఆయన నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. అధ్యక్షుడు బిల్ల రవీందర్‌తో పాటు, సభ్యులను రాఘవరెడ్డి అభినందించారు.

నేడు కేయూలో డ్రగ్‌పై సదస్సు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్), డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ హనుమకొండ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 26న ఉదయం క్యాంపస్‌లోని సెనెట్ హాల్‌లో ఇంటర్నేషనల్ డే అగెనెస్ట్ డ్రగ్ అబ్యూస్ అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ తెలిపారు. ముఖ్యఅతిథిగా కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ హనుమకొండ చైర్మన్, జిల్లా జడ్జి పట్టాభి రామరావు, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం పాల్గొంటారని తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాస్‌రావు

ఖిలా వరంగల్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు సూచించారు. ఖిలా వరంగల్ మండలం మార్కండేయ నగర్‌లో పార్టీ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి, జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాష్‌మియా అధ్యక్షతన బుధవారం సీపీఐ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సీపీఐ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం ఉంటేనే మేలు జరుగుతుందని ప్రజలు భావిస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యలపై నిత్యం పోరాడేది కమ్యూనిస్టులేనని గుర్తుచేశారు. వేలాది మందిని సమీకరించి భూపోరాటాలు నిర్వహించిన ఘనత సీపీఐదేనని అన్నారు. సమావేశంలో నాయకులు భవాని, నల్లతీగల కుమార్, పంజాల రమేష్, పనాస ప్రసాద్, గన్నారపు రమేష్, దండు లక్ష్మణ్, జాన్‌పాల్, ఓర్సు రాజు, గుండె బద్రి, ల్యాదెళ్ల శరత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నలుగురు బీఎస్సీ విద్యార్థులు బెంగుళూరులోని ప్రైవేట్ అకాడమీ నిర్వహించిన రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఇంటర్వ్యూకు హాజరై ప్రతిభ కనబరిచారు. ఈమేరకు హృతిక్ రాజు, అశోక్, సాత్విక్, జయంత్ రూ.వేయి చొప్పున నగదు ప్రోత్సాహకం అందుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్, అధ్యాపకులు జితేందర్, డాక్టర్ సరిత తదితరులు పాల్గొన్నారు.